క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి పూజలు



పొన్నూరు: పొన్నూరులో గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని షిర్డీ సాయి మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృత అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పాత పొన్నూరు శ్రీ షిర్డీ సాయిబాబా దేవస్థానంలో 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకం చేశారు. పాత పొన్నూరు, చింతలపూడి ప్రాంతాల్లోని సాయిబాబా ఆలయాల్లో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయినాథుని దర్శించుకున్నారు.

సేవలకు ప్రతిరూపం లయన్స్ క్లబ్‌లు

నగరంపాలెం: లయన్స్ క్లబ్‌లు సేవలకు ప్రతిరూపమని క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 316 హెచ్ గవర్నర్ పరుచూరి గోపీచంద్ అన్నారు. జేకేసీ కళాశాల సమావేశం మందిరంలో ఆదివారం జిల్లా లయన్స్ క్లబ్స్ మొదటి కార్యవర్గ సమావేశం, క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారుల శిక్షణ తరగతులను నిర్వహించారు. ముఖ్యఅతిథి ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్, జిల్లా చీఫ్ అడ్వైజర్ నూతలపాటి వీరప్రకాష్‌రావు మాట్లాడుతూ 2024–25లో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, పర్యావరణ పరిరక్షణ, క్యాన్సర్ వ్యాధిపై అవగాహన, నిరోధక సేవా కార్యక్రమాల నిర్వర్తించి, 316 హెచ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని సూచించారు. జిల్లా క్యాబినెట్ కార్యదర్శి వివి సుబ్బయ్య, కోశాధికారి డాక్టర్ సిహెచ్ చక్రపాణి, మాజీ గవర్నర్ కృపానందం, ఎంసీసీ శ్రీనివాసరావు, జోనల్, జిల్లాల చైర్మన్లు, సమన్వయకర్తలు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలను దూషించిన వారిపై కేసు

గుంటూరు ఈస్ట్: ఉద్యోగం ఇస్తామని పిలిచి స్పష్టమైన సమాధానం చెప్పకపోగా, మహిళలను అసభ్యకరంగా దూషించిన ఇద్దరిపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొన్నూరు రోడ్డులోని పంచవటి అపార్టుమెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో షేక్ అఫీన్, షేక్ ఆరీఫ్ బెటర్‌మెంట్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో ఓ సంస్థ నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రకటన ఇచ్చారు. ఫోన్‌లో సంప్రదించిన పలువురు ఆదివారం పొన్నూరు రోడ్డులోని సంస్థ కార్యాలయానికి వచ్చారు. ఉద్యోగం విషయంలో స్పష్టత ఇవ్వకుండా పొంతనలేని సమాధానం ఇచ్చారు. ఇదేమని ప్రశ్నించినవారిని దుర్భాషలాడారు. మహిళలను అసభ్య పదజాలంతో దూషించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు అఫీన్, ఆరీఫ్‌లను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆషాఢ సారె మహోత్సవం



నగరంపాలెం: జగన్నాథ స్వామి కోలాట భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేటలోని జగన్నాథ స్వామివారి దేవస్థానంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారికి ఆషాఢ సారె మహోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం అమ్మవార్లకు కుంకుమ పూజ చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

రవీంద్రనగర్‌లో కవితా గోష్టి



నగరంపాలెం: స్థానిక రవీంద్రనగర్‌లోని కుర్తాళ శ్రీసిద్ధేశ్వరీపీఠ విభాగం మంత్రాశ్రమంలో ఆదివారం కవితా గోష్టి నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామీజీ ఆశీస్సులతో వ్యాస పూర్ణిమ సందర్భంగా కార్యక్రమం జరగ్గా, మంత్రాశ్రమ నిర్వహణాధికారి నరసింహానంద భారతీస్వామి ప్రారంభ ప్రవచనంతో సభ ప్రారంభమైంది. హిందూ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డీఎస్ దీక్షితులు అధ్యక్షత వహించి, వ్యాసుని గొప్పతనం, వ్యాస పూర్ణిమ వైశిష్ట్యాన్ని వివరించారు. పలువురు కవులు, పండితులు తమ కవితలను వినిపించారు. పి.హైమానంద్, కార్యవర్గ సభ్యుడు శ్రీరామకృష్ణ ప్రసాద వితరణ చేశారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని శలపాడు గ్రామం సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి సందర్భంగా మూడు రోజులుగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సామూహిక సాయి వ్రతాలు, రుద్ర హోమం జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. పంచామృత అభిషేకాలు, విశేషార్చన, పల్లకీసేవ, ఉయ్యాలసేవ తదితర కార్యక్రమాలను అర్చక స్వాములు ఘనంగా నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గురు పౌర్ణమి సందర్భంగా అన్నదానం

చేబ్రోలులోని చతుర్ముఖ బ్రహ్మ దేవాలయం సమీపంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు అర్చకులు నిర్వహించారు. బాబా భక్త సమాజం ఆధ్వర్యంలో సుమారు ఐదువేల మందికి అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చింతలపూడి సాయిబాబా ఆలయంలో...



శలపాడు గ్రామంలోని సాయిబాబా మందిరంలో...



చేబ్రోలులో పూజలు అందుకున్న సాయిబాబా

ఘనంగా గురు పౌర్ణమి

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో శ్రీశైలం కాలనీ సాయినాథుని ఆలయంలో గురు పౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని దంపతులు స్వామి వారికి వ్రతాలను నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో భాగంగా స్వామి వారి తీర్థ ప్రసాదం, మహాన్నదానం చేశారు. ఆలయ కమిటీ భక్తుల సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో దాదాపు 5 వేల మందికిపైగా స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేసి ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న అంబటి మురళీకృష్ణ

మామిళ్లపల్లిలో ప్రత్యేక పూజలు

పొన్నూరు: మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సద్గురు సాయి ఆలయంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ గావించారు. కార్యక్రమంలో సర్పంచ్ జాలాది యానాదిరావు, మాజీ సర్పంచ్ పిచ్చిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మామిళ్లపల్లి సాయిబాబా ఆలయంలోని పూజల్లో అంబటి మురళీకృష్ణ



స్వామికి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకాకాని: పెదకాకాని వెనిగండ్ల ఆటోనగర్, బైపాస్ ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పెదకాకాని ఏఈ బత్తుల శ్రీనివాసరావు తెలిపారు. అలాగే తక్కెళ్ళపాడు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, రామచంద్రపాలెం, గోళ్ళమూడి, దేవరాయబొట్లవారిపాలెం గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయానికి గ్రామ ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించగలరు డీఈ పీహెచ్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

ఆశ్రమ విద్యార్థులకు అన్నదానం



పొన్నూరు: మండలంలోని బ్రాహ్మణ కోడూరులో బాలల ఆశ్రమంలో మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల 2022–24 ఇంటర్ విద్యార్థులు, లెక్చరర్స్ మహేష్, దుర్గా, రాజకుమార్ సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్, తస్నీరు రవీంద్ర, గోపి భాస్కర్, శ్రీను, విజయ్, మేకనాథ్ జాహ్నవి, గుణశేఖర్, చైల్డ్ హోమ్ సభ్యులు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

డఫ్ పేటలో చోరీ.. నగదు, నగలు అపహరణ

పొన్నూరు: పట్టణంలోని 5వ వార్డు డఫ్ పేటలోని ఇంట్లో దొంగతనం జరిగి నగదు, నగలు అపహరణకు గురైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని నగల దుకాణం వద్ద పనిచేసే బంగారం, వెండి వస్తువుల తయారీదారుడైన షేక్ గౌస్ పీర్ ఈ నెల 16వ తేదీన కుటుంబ సమేతంగా ఊరికి వెళ్లాడు. 18న ఇంటికి చేరుకుని యథావిధిగా తమ కార్యకలాపాలు కొనసాగించారు. అయితే గౌస్ పీరా నగదు దాచేందుకు ఆదివారం బీరువా తలుపులు తెరవడంతో దొంగతనం జరిగి రూ.4.60 లక్షల నగదు, 14 సవర్ల నగలు చోరీకి గురయినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేశారు. స్థానిక ప్రజలను విచారించి, సీసీ కెమెరాలు పరిశీలించారు. క్లూస్ టీం వివరాలు సేకరించారు. కూతురి వివాహం కోసం దాచుకున్న డబ్బులు, బంగారం అపహరణకు గురికావడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బీరువాలోని లాకర్ పగులకొట్టిన దృశ్యం



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

వరి పైరు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

పెదకాకాని : వరి పైరు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. పెదకాకాని మండలంలోని పెదకాకాని, గోళ్ళమూడి, ఉప్పలపాడు, తక్కెళ్ళపాడు పొలాలను ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో పరిశీలించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో ఎదబెట్టిన వరి విత్తనాలు మొలక దశలో ఉన్నాయని, పలు చోట్ల వరి చక్కగా మొలిచిందన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షం కారణంగా పల్లపు ప్రాంతాల్లో నీళ్లు నిలబడి మొలిచిన మొక్క ఉరకెత్తి చనిపోయే పరిస్థితి ఉందన్నారు. దెబ్బతిన్న పొలాల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు కొరత లేకుండా సప్లై చేయాలన్నారు. అలానే గుంటూరు చానల్ పూర్తిగా గుర్రపు డెక్కతో మూసుకు పోయిందని దీనివలన నీరు కిందకి పోయే మార్గం లేక పొలాల్లో నీరు నిలబడే అవకాశం ఉందన్నారు. గుంటూరు చానల్ అనేక గ్రామాలకు పొలాలకు సాగునీరుతో పాటు అనేక గ్రామాల ప్రజల దాహార్తిని తీరుస్తుందన్నారు. గత ప్రభుత్వం పూడిక తీయకపోవటం, గుర్రపు డెక్క తొలగించకపోవడం వలన రైతులతో పాటు ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం గుర్రపుడెక్క తొలగించాలని కాలువ లాకులకు మరమ్మతులు చేయాలని నేతాజీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, జి.రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పెదకాకాని వద్ద గుంటూరు చానల్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పేద వృద్ధులకు పెన్షన్ల పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ – ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆగస్టు 20న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రూ.20 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేయనున్నట్లు అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు తెలిపారు. ఆదివారం అరండల్ పేటలోని సంస్థ కార్యాలయంలో గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 పేదలకు పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ అతిథిగా పాల్గొన్న మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మద్దు రామకృష్ణయ్య మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతి నెల 108 మందికి రూ.500 చొప్పున పెన్షన్లు ఇవ్వడంతో పాటు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించి, ఔషధాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సివిల్స్ శిక్షణ పొందే విద్యార్థులకు రూ.3 లక్షల విరాళాన్ని ప్రకటించారు. గురుపౌర్ణమి సందర్భంగా వ్యాస మహర్షికి పూజలు నిర్వహించారు. డాక్టర్ వైదేహి గురుపౌర్ణమి విశిష్టతను తెలియజేశారు. అవోపా రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు చింతా కృష్ణారావు, నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మద్ది సాయి రమేష్, మట్టుపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు పెన్షన్లు అందజేస్తున్న రాంబాబు, కేవీ బ్రహ్మం, మద్దు రామకృష్ణయ్య

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

తాడికొండ: స్థానిక శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. బండ్ల కోటేశ్వరరావు మిత్ర మండలి ఆధ్వర్యంలో మొత్తం 143 మంది వృద్ధులకు పరీక్షలు చేశారు. అందులో 78 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి, ఉచితంగా చికిత్స చేసేందుకు వైద్యులు నిర్ణయించారు. వీరిని బుధవారం ఉచితంగా బస్సులో తీసుకెళ్లి శస్త్ర చికిత్స నిర్వహించి, తిరిగి ఇంటికి పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులు బండ్ల కోటేశ్వరరావు, ధనేకుల హరిబాబు, బండ్ల పట్టాభిరామయ్య, మట్టుకొయ్య శామ్యూల్, యాకోబు, పెద్దబ్బాయి, చింతల భాస్కరరావు, ధనేకుల నాగేశ్వరరావు, సుధాకర్, అనీషా, బసివిరెడ్డి, మోహన్‌రెడ్డి, అంజయ్య, తిరుపతిరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



సమీకృత వసతి గృహ నిర్మాణం పూర్తి చేయాలి

లక్ష్మీపురం: స్థానిక బి.ఆర్.స్టేడియం సమీపంలో ఉన్న కోడిగుడ్ల సత్రంలో నిర్మిస్తున్న సమీకృత సంక్షేమ భవన్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ వసతి గృహ పనులు ఇంకా పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాలుగా ఏఐఎస్ఎఫ్ నాయకత్వం ఆందోళన కార్యక్రమాల రూపంలో, వినతి పత్రాల రూపా ల్లో సంక్షేమ శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా కూడా వారు కనీసం పట్టించుకోలేదన్నారు. మరోపక్క గుంటూరు నగరంలో బీసీ హాస్టల్‌కు కనీసం ఒక్క శాశ్వత భవనం కూడా లేదన్నారు. నాలుగు జిల్లాల నుంచి చదువుకోవడానికి వచ్చే ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద వర్గాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే ఈ సంక్షేమ భవన్ పనులను తక్షణమే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం నగర కార్యదర్శి యశ్వంత్, డేవిడ్, కిరణ్, గణేష్, బన్నీ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

దిగజారుతున్న విద్యానాణ్యత ప్రమాణాలు

లక్ష్మీపురం: ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు సాధారణ కూడికలు కూడా చేయలేకపోతున్నారని సొంత భాషలో వాడుకలో ఉన్న పదాలను సైతం రాయలేకపోతున్నారని విద్యావేత్త బి.సి.హెచ్.అనంతరామయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యా నాణ్యత ప్రమాణాలు దారుణంగా దిగజారుతున్నాయన్న ఐక్యరాజ్యసమితి బాలల సంక్షేమ విభాగం యూనిసెఫ్ తన తాజా నివేదికలో ఆందోళన వ్యక్తం చేయడంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యా విషయాల విశ్లేషకులు ఆర్.వి. సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంస్థ సీనియర్ సభ్యులు ప్రసంగించారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: పెళ్లి చేసుకుంటానని మహిళను నమ్మించి, మోసం చేసిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్రాడీపేటకు చెందిన ఓ మహిళ, అంకిరెడ్డిపాలెంకు చెందిన ఓర్సు శివకృష్ణ రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మహిళపై పలు మార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం పెళ్లి చేసుకునేందుకు నిరాకరించాడు. బాధితురాలు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైరల్ ఇన్‌ఫెక్షన్ల వల్లే సీజనల్ శ్వాసకోశ వ్యాధులు

లక్ష్మీపురం: ఈ సీజన్‌లో దగ్గు, జలుబులాంటి శ్వాస కోశ వ్యాధులు రావడం సహజమని వీటి కోసం అనవసరంగా యాంటీబయాటిక్స్ వాడి వ్యాధి నిరోధక శక్తిని తగ్గించుకోవద్దని ప్రభుత్వ సమగ్రాసుపత్రి వైద్యుడు డాక్టర్ వెంకట కల్యాణ్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థకార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో ఎక్కడ చూసినా జ్వరాలు, దగ్గు, జలుబు లాంటివి కనిపిస్తున్నాయని, వాటి పట్ల అతిభయం అవసరం లేదని రెండు రోజులు వేచి చూసి తగ్గక పోతే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. ఇంటి చిట్కాలతోనే వ్యాధులు తగ్గు ముఖం పడతాయన్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకే మందుల షాపులు, లేబొరేటరీలు, డాక్టర్ల వద్దకు వెళ్లి ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకోవద్దని సూచించారు. అనంతరం డాక్టర్ వెంకట కల్యాణ్‌ను సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకట కల్యాణ్

నీటి ప్రవాహానికి అడ్డుగా గుర్రపు డెక్క

చేబ్రోలు: వ్యవసాయ సాగుకు ప్రధానమైన సాగు నీటి కాలువలు, మురుగునీటి కాలువలకు ఈ ఏడాది మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టకపోవటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పొలాల్లోని నీరు బయటకు పోయే డ్రెయిన్‌లు సక్రమంగా లేకపోవటంతో పొలాల్లోని వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. చేబ్రోలు మండలంలోని 13 గ్రామాల పరిధిలో 16 వేల ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన ఈ నెల మొదటి వారంలో వెద పద్ధతిలో సగం విస్తీర్ణంలో విత్తనాలు నాటారు. పొలాల్లో నీరు నిలిచిపోవటంతో మొలక శాతం తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని శలపాడు–వీరనాయకునిపాలెం గ్రామాల పరిధిలోని నల్ల డ్రెయిన్ పూడికతీత పనులు జరగకపోవటంతో గుర్రపు డెక్క, చెత్తా, చెదారంతో నిండిపోయింది. డ్రెయిన్ నిండుగా నీరు ఉండటంతో పొలాల్లోని నీరు బయటకు పోవటానికి అవకాశం లేకుండా పోయింది. చేబ్రోలు, నారాకోడూరు, శేకూరు గ్రామాల పరిధిలోని డ్రెయిన్‌లు, సాగునీటి కాలువలు అధ్వానంగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎడతెరిపిలేని వర్షంతో రైతుల ఆందోళన

చేబ్రోలు మండల పరిధిలోని గ్రామాల్లో శని, ఆదివారాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. పొలాల్లో నీరు చేరటంతో తటాకాలను తలపిస్తున్నాయి. మాగాణి, మెట్ట, కూరగాయ రైతులు విత్తనాలు నాటే సమయంలో భారీ వర్షాలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.



శలపాడు-వీరనాయకునిపాలెం గ్రామాల మధ్య నల్ల డ్రెయిన్‌లో గుర్రపు డెక్క

వివాలో ముగిసిన ఐకరాజ్యసమితి నమూనా సదస్సు

పెదకాకాని: వివా ది స్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఐక్యరాజ్యసమితి నమూనా సదస్సు ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై చర్చించి తమదైన పరిష్కారాలు ప్రకటించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తులసి సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు హాజరయ్యారు. ఈ సదస్సులో చర్చల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ విషయాలపై అవగాహన కలిగి ఉండాలని తద్వారా ప్రపంచస్థాయి పౌరులుగా ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, డైరెక్టర్ కమాండర్ కే శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న తులసి రామచంద్ర ప్రభు

ప్రభుత్వ నిర్ణీత ధరలకే కందిపప్పు, బియ్యం

తాడికొండ అమ్మకాలు ప్రారంభించిన తహసీల్దారు

తాడికొండ: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కందిపప్పు, బియ్యం అమ్మకాలు జరగాలని తహసీల్దారు మధుసూదనరావు స్పష్టం చేశారు. తాడికొండలోని విజయదుర్గా సూపర్ బజారులో ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.160లకు కిలో కందిపప్పు, రూ.48లకే కిలో బియ్యం అమ్మకాలు ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు, బియ్యం అధికంగా ఉండటంతో సామాన్యుడికి అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం నిర్ణయించిన సూపర్ బజార్‌లు, దుకాణాల్లో తక్కువ ధరలకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180, బియ్యం రూ.60లుగా ధరలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డెప్యూటీ తహసీల్దారు అనిల్‌కుమార్, వీఆర్వో శర్మ, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమ్మకాలు ప్రారంభిస్తున్న తహసీల్దారు మధుసూదనరావు